క్లుప్తంగా

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



గుడివాడ టౌన్: స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో శుక్రవారం ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక జరిగింది. 16వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సన్నార్‌సింగ్ పర్యవేక్షణలో డిగ్రీ విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ ఎంపికలో 21 మంది బాలురు, 12 మంది బాలికలు ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. మూడు సంవత్సరాలు వీరికి విద్యతోపాటు నేషన్ బిల్డింగ్ క్రమశిక్షణ, నేషన్ ఇంటిగ్రేషన్ వంటి అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వీరికి సి-సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎండీ సలీమ్ పాల్గొన్నారు.

ఆయుష్షును పెంచేది ధ్యానం

గుడివాడ టౌన్: ధ్యానం మానసిక ఒత్తిడిని తగ్గించి మనిషిలోని రుగ్మతలను దూరంచేసి ఆయుష్షును పెంచుతుందని విశాఖపట్నానికి చెందిన పిరమిడ్ మాస్టర్ వరలక్ష్మి అన్నారు. స్థానిక శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో పౌర్ణమి ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ధ్యానం సాధన చేయడం వలన జ్ఞానాన్ని సంపాదించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ శ్వాస మీద ధ్యాస నేర్చుకుని కొనసాగిస్తే ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారన్నారు. అనంతరం పిరమిడ్ మాస్టర్ వరలక్ష్మిని ధ్యాన కేంద్ర నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ధ్యాన కేంద్ర నిర్వాహకురాలు రాజకుమారి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: ఆల్ ఇండియా మావాతిక షిటోరియో కరాటే చాంపియన్ షిప్-2024లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు కైవసం చేసుకున్నారని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన చెన్నైలోని ఐసీఎఫ్ పాఠశాల ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తమ విద్యార్థులు అండర్-14 వ్యక్తిగత కటా విభాగంలో బి. మంజునాథ్, బి.లక్ష్మి సాయిచరణ్, టి.నాగశాన్వి, బి.చాతుర్య, కె.దేవీప్రియ, జె.తీక్షిక, బి.జస్వంత్, కె.వేదశ్రీ పలు పతకాలు సాధించారన్నారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను, కోచ్ ఎస్. వెంకటేశ్వరరావును పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, కె. జ్యోతి, ప్రశాంతి అభినందించారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

కైకలూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జీఎం దయాకర్ డిమాండ్ చేశారు. కైకలూరు జూనియర్ కాలేజీలో పసుపు రిబ్బన్లు కట్టుకుని శుక్రవారం వారు విధులకు హాజరయ్యారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



మొవ్వ: పామర్రు మండలం నల్లగుంట గురుకుల పాఠశాల్లో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ పామర్రు నియోజకవర్గ కబడ్డీ పోటీల్లో మొవ్వ మండల విద్యార్థులు సత్తాచాటి జిల్లా జట్టుకి ఎంపికైనట్లు మొవ్వ సమన్వయకర్త కే మోహనకృష్ణ చంద్ తెలిపారు. ఈ పోటీల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో పలు పాఠశాలలకు చెందిన 22 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు ఈ నెల 21వ తేదీన జగ్గయపేటలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

రేపు ఖో-ఖో జట్ల ఎంపిక

గుడివాడ టౌన్: ఉమ్మడి కృష్ణా జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఖో-ఖో జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మడకా ప్రసాదు, ఎంపీ. సత్య ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో జరిగే ఈ ఎంపికలో 2006 నవంబర్ ఒకటో తేదీ తదుపరి జన్మించిన వారై ఉండి, క్రీడాకారుల ఎత్తు, బరువు, వయస్సు మొత్తం 250 పాయింట్లు మించి ఉండకూడదని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 20వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఆధార్, వయో ధ్రువీకరణ పత్రాలతో ఎంపికకు హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీలకు అందని పుస్తకాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సంబంధించిన పీపీ-1,2 పుస్తకాలు ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం సరఫరా చేయలేదు. దీంతో పిల్లలకు కాన్వెంట్ తరహా బోధన అందడం లేదు. పుస్తకాల సరఫరాను నిలిపివేసి, పాత విధానాన్ని అమల్లోకి తెచ్చే ఆలోచనలో కూటమి సర్కారు వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి.

కాన్వెంట్ తరహా బోధనకు మంగళం?



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు (ఫైల్)



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేసిన పీపీ-1, పీపీ-2 పుస్తకాలు

పామర్రు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందించాల్సి ఉంది. కేంద్రాలకు మూడు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులు వస్తుంటారు. బాల్య దశలోనే విజ్ఞానం పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమం అలవాటు చేసి, ఆంగ్లంపై పిల్లలు పట్టు సాధించేలా వారి చదువుకు బలమైన పునాదులు వేయాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్య(ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్)కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలతో పాటు ఆట పరికరాలు అందించారు. నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇంగ్లిష్, మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లిష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించి బడ్స్ పేరుతో ఐదు పుస్తకాలతో కూడిన పీపీ (ప్రీ ప్రైమరీ)-1 కిట్లను, నాలుగు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లు ఏటా అందజేసేవారు. ఆ పుస్తకాల ఆధారంగానే పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు బోధించేవారు. దీంతో వారికి చాలా సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన సాగేది. కాన్వెంట్ స్కూళ్ల తరహా బోధన గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతుండడంతో గత ప్రభుత్వంలో ఈ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

పుస్తకాల సరఫరా చేయలేదు

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికీ అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలు సరఫరా చేయలేదు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు పాత పుస్తకాలతో బోధన చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న కాన్వెంట్ తరహా బోధనకు మంగళం పాడేలా పుస్తకాల సరఫరాను నిలిపివేసి పాత విధానాన్ని అమల్లోకి తెచ్చే ఆలోచనలో కూటమి సర్కారు వ్యవహరిస్తోందన్న విమర్శలు పిల్లల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. పామర్రు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పామర్రు మండలంలో 55, పెదపారుపూడి మండలంలో 39, పమిడిముక్కల మండలంలో 64, తోట్లవల్లూరులో 38 కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 1,654 మంది, మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 976 మంది ఉన్నారు. మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లల అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తుంటారు. వీరందరికీ ప్రభుత్వం పుస్తకాలు సరఫరా చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఇంత వరకు సరఫరా చేయని కారణంగా అంగన్‌వాడీలోని చిన్నారుల బోధనకు ఇబ్బందికరంగా ఉంటోంది.

వచ్చిన వెంటనే అందిస్తాం

ఈ ఏడాది ఇంత వరకు పీపీ కిట్స్ రాలేదు. అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు సంబంధించిన బుక్స్ పీపీ-1, పీపీ-2 పుస్తకాలు ఇంకా రాలేదు. పుస్తకాలు వచ్చిన వెంటనే కేంద్రాలకు చేరవేసి, వాటిని పిల్లలకు అందిస్తాం.

– వీ భానుశ్రీ, సీడీపీఓ, పామర్రు

విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన విరమించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ట్రూ ఆఫ్ చార్జస్, సర్దుబాటు చార్జీల పేరుతో రూ. 8,114 కోట్లు ప్రజలపై భారం మోపే ఆలోచనను విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి కోరారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. వెంటనే ఈ ప్రతిపాదనను ఉప సంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పి.రజిని, గూడపాటి గోపాల్, ఎల్.సురేంద్ర, శేషయ్య, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: విద్యుత్ ప్రైవేటీకరణను ఆపాలంటూ సీపీఎం మండల నాయకుడు బి.వి.శ్రీనివాసరరావు ఆధ్వర్యంలో వడ్లమన్నాడు, కొండిపాలెంలో శుక్రవారం నిరసనలు చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి కటికల యాకోబు, ఉపాధ్యక్షుడు మోటపర్తి రేణుకారావు, సభ్యులు కొండయ్య, పి.బాలమ్మ, సరోజిని, జార్జి, శ్యామ్‌ప్రసాద్, కామేశ్వరమ్మ, రమాదేవి, సుజాత, ఎం.కృష్ణవేణి, పి.నాగలక్ష్మి, నాంచారమ్మ, హైమావతి, ఇందు, రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’స్పెల్‌బీకి విశేష స్పందన



పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

గుడివాడ టౌన్ : సాక్షి మీడియా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్పెల్‌బీ పరీక్షలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక ఏలూరు రోడ్డులోని విద్యాలయ ఇంగ్లిష్ మీడియం స్కూల్, బైపాస్ రోడ్డులోని కేకేఆర్ గౌతమ్స్ స్కూల్స్‌లో జరిగిన ఈ పరీక్షల్లో విద్యాలయ పాఠశాలకు సంబంధించి 134 మంది, గౌతమ్ పాఠశాల గుడివాడ శాఖ నుంచి 395 మంది, గౌతమ్ జిల్లా వ్యాప్తంగా 17 బ్రాంచిలలో 1,898 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. విద్యాలయ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్, డైరెక్టర్ బొప్పన శాంతి, గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్స్ లక్ష్మీప్రసాద్, సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కో-ఆర్డినేటర్ పి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన వైకల్యాలు తగ్గుతాయి



సాక్షి మీడియా నిర్వహిస్తున్న ఈ స్పెల్‌బీ పోటీ పరీక్షలలో పాల్గొనడం వలన విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై అభ్యసన వైకల్యాలు తగ్గుతాయి.

– బొప్పన విజయభాస్కర్, విద్యాలయ డైరెక్టర్

భాషపై పట్టు సాధిస్తాం



స్పెల్‌బీ పరీక్ష వలన భాషపై పట్టు సాధిస్తాం. ఇంగ్లిష్‌పై ఉన్న భయం పోతుంది. ఎన్నో పదాలు నేర్చుకోడానికి అవకాశం కలుగుతుంది.

– ఎస్.శ్రీనిధి, విద్యాలయ విద్యార్థిని

ఇంగ్లిష్‌పై పరిజ్ఞానం పెరుగుతుంది



విద్యార్థుల స్థాయిని బట్టి కొత్త కొత్త పదాలను పోటీ పరీక్షల్లో రాయాల్సిరావడంతో పదాలు నేర్చుకోవడంపై ఆసక్తి పెరిగింది. ఇంగ్లిష్‌పై మరింత పరిజ్ఞానం పెరుగుతుంది.

– సీహెచ్.బృందావని, గౌతమ్ పాఠశాల విద్యార్థిని

సాక్షి యాజమాన్యం మంచి ఆలోచన



సాక్షి యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయం విద్యారంగానికే ఒక మార్గదర్శకం. గత 13 సంవత్సరాలుగా ఈ విధానాన్ని అమలు చేయడం వలన ఎంతో మంది విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించగలిగారు.

– కె.జ్యోతి, గౌతమ్ పాఠశాల ప్రిన్సిపాల్

భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం



మండవల్లి: మండలంలో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శుక్రవారం 8.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ కారణంగా స్థానిక సెంటర్‌లోని ఆర్‌అండ్‌బీ రోడ్డు, మండలంలోని వివిధ గ్రామాల రహదారులు వర్షం నీటితో నిండి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి రహదారులు సక్రమంగా లేక పలు సమస్యలు ఎదుర్కొన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణ, పీహెచ్‌సీకి వెళ్లే రహదారిపైకి వర్షం నీరు చేరడంతో రోగులు అవస్థలు పడ్డారు.

డంపింగ్ యార్డు స్థలం పరిశీలన

కైకలూరు: డంపింగ్ యార్డు స్థలాన్ని జేసీ ధాత్రి రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కైకలూరు పంచాయతీకి రోజువారి చెత్త వేయడానికి స్థలం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏలూరు రోడ్డు వద్ద రోడ్డు పక్కనే రోజువారీ చెత్తను విడిచిపెట్టడం వల్ల పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. దీంతో దాని గూడెం నుంచి శ్మశానం సమీపంలో రెండు ఎకరాల 90 సెంట్ల భూమిని డంపింగ్ యార్డుకు కేటాయించారు. ప్రతిపాదిత స్థలాన్ని జేసీ పరిశీలించి అనుమతులు మంజూరు చేసినట్టు ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం తెలిపారు.

కైకలూరు ఎంపీడీఓగా ఫణీంద్రరెడ్డి

కైకలూరు: మండల నూతన ఎంపీడీవోగా బత్తుల ఫణీంద్రరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అల్లూరి జిల్లా నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా కైకలూరుకు వచ్చారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

బల్లిపర్రు(పామర్రు): గ్రామాల్లో సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని బల్లిపర్రులో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఎంపీడీఓ జ్యోతి, పీఆర్ ఏఈ రామారావు, నాయకులు వల్లూరిపల్లి గణేష్, కె ప్రవీణ్‌చంద్ర, సంజీవరావు, సుధాకర్, వీరాంజనేయులు, శోభన్‌బాబు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

ముదినేపల్లి రూరల్: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెయ్యేరు శివారు అప్పారావుపేటలో సీసీ రోడ్లకు ఎన్డీయే నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరైన నాలుగు రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ రామకృష్ణ, నాయకులు శేషుబాబు, నాగలక్ష్మి, వీరాస్వామి, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని అల్లినగరం, పెరికెగూడెం గ్రామాల్లో ఎన్డీఏ నాయకులు శుక్రవారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, ముళ్లపూడి సత్తిబాబు, నారగాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల్లో శుక్రవారం ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరం బీటెక్, ఎంబీఏ మొదటి సంవత్సర విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికారు. సీనియర్లను గౌరవించి వారి నుంచి సలహాలు, సూచనలు జూనియర్లు తీసుకోవాలని, సీనియర్లు జూనియర్లను ఆదరిస్తూ వారికి మార్గదర్శకాలు తెలియజేసి వారి ఉన్నతికి సహకరించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కలిదిండి(కైకలూరు): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కలిదిండి మండలం ఆరుతెగళపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఈ నెల 16, 17 తేదీల్లో విజయవాడ పడమట జెడ్పీహెచ్ స్కూల్‌లో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆరుతెగళపాడు పాఠశాల నుంచి అండర్-17 విభాగంలో పదో తరగతి విద్యార్థులు వి.నివాస్, బి.సంతోష్, అండర్-14 విభాగంలో కే సుహాస్ ప్రతిభచూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21, 23 తేదీల్లో సత్యసాయి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన పీడీ పి.లూయిస్, ఎంపికైన క్రీడాకారులను హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయుడు టీబీ శంకరరావు అభినందించారు.

డీఎన్నార్‌ను కలిసిన నాయకులు



కైకలూరు: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)ను పార్టీ జిల్లా నాయకులు గోరుముచ్చు గోపాల యాదవ్, బీవీ రావు ఏలూరు పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. జిల్లాలో పార్టీ పటిష్టతపై పలు అంశాలపై చర్చించుకున్నారు. వీరితో పాటు మాజీ ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి ఉన్నారు.

కల్యాణమస్తు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బంగారు కాయిన్‌ను అందజేస్తున్న డైరెక్టర్ కృష్ణారెడ్డి

ఎలకుర్రు(పామర్రు): కల్యాణమస్తు పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ ట్రస్టు బోర్డు జిల్లా డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎలకుర్రులోని కేంద్రంలో పాల ఉత్పత్తిదారుడి కుమార్తె వివాహం సందర్భంగా శుక్రవారం ఆమెకు గోల్డు కాయిన్‌ను అందజేశారు. పాల శీతల కేంద్రం మేనేజర్ గోపినాథ్, ఎలకుర్రు పాల సేకరణ కేంద్రం అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

■ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: మండలంలోని పమిడిముక్కల, కృష్ణాపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పట్టణంలోని సబ్ స్టేషన్ మరమ్మతులు, ఇతర లైన్ల సర్దుబాట్లు సందర్భంగా శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారంతెలిపారు. శనివారం ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు పెద ఎరికపాడు, బేతవోలు, నిమ్మతోట, ఇందిరానగర్ కాలని, వాంబే కాలని తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: స్థానిక విద్యుత్‌శాఖ ఉప కార్యాలయం మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్‌శాఖ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాస్ తెలిపారు. కైకలూరు ఉప కేంద్ర పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: దేవరపల్లి, యాకమూరు, వల్లూరుపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు ట్రాన్స్‌కో ఈఈ డి.కృష్ణానాయక్ తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్ : విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ డివిజన్ విద్యుత్ డీఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ మెగా ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ గుడివాడ సేవా కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక టిడ్కో గృహ సముదాయం వద్ద గల వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు జరిగిన వైద్యపరీక్షల్లో 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ, కార్యదర్శి కె. రామారావు, కోశాధికారి కె. రామకృష్ణ, వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సనకా సుబ్బారావు పాల్గొన్నారు.

■ ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయం ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆ హాస్పిటల్లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో హాస్పిటల్ ఏఓ హనుమకుమార్, హాస్పిటల్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, కుమార్, శివకుమార్, సుభాష్‌కుమార్ పాల్గొన్నారు.

■ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

ముదినేపల్లి రూరల్: రీసర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుభానీ కోరారు. మండలంలోని గురజ, పెనుమల్లి, సంఘర్షణపురంలో రీసర్వేపై గ్రామసభలు శుక్రవారం నిర్వహించారు. సర్వేయర్ రాజశేఖరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

■ అభివృద్ధి పనులకు శ్రీకారం

కైకలూరు: మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో శంకుస్థాపనల వారోత్సవాల్లో భాగంగా రాచపట్నంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.16.59 లక్షల నిధులతో పనులను సర్పంచ్ అల్లూరి మంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు ఈడా కృష్ణవేణి శుక్రవారం ప్రారంభించారు. టీడీపీ మండలాధ్యక్షుడు పెన్మత్స త్రినాథరాజు, నాయకులు లక్ష్మణరావు, శ్రీనివాసరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ మిషన్ శక్తిపై అవగాహన

మండవల్లి: భైరవపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సుకన్య సంవృద్ధి యోజన ద్వారా ఆడపిల్లల భవిష్యత్‌కు అవసరమైన ఆర్థిక పొదుపు, ఆడపిల్లలను చదివిద్దాం, ఆడపిల్లలను బతికిద్దాం అనే నినాదంపై బాల్యవివాహాలపై ప్రతిజ్ఞ చేయించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. మునగాకు, కరివేపాకులోని పోషక విలువలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్‌వి నాగలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ కె.భాగ్యలక్ష్మి, మహిళా కానిస్టేబుల్ ప్రేమసోనా పాల్గొన్నారు.

■ కొత్త పీఆర్‌సీ వెంటనే ఇవ్వాలి

తోట్లవల్లూరు: ఉద్యోగులకు నూతన పీఆర్‌సీని వెంటనే ఇవ్వాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ మండల శాఖ అధ్యక్షుడు పి.రాజారాయల్, ప్రధానకార్యదర్శి సుమన్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్‌ఐ లోన్లు, సరెండర్ లీవ్ నగదుతోపాటు పలు పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

■ ప్రకృతి సేద్యంపై అవగాహన

ముదినేపల్లి రూరల్: బొమ్మినంపాడు దళితవాడలో ప్రకృతి సేద్యంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో జీవామృతం తయారీ విధానాన్ని తెలియజేశారు.

వైన్ షాపు వద్దంటున్న గ్రామస్తులు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడి-పెడసనగల్లు రోడ్డు పక్కనే ఉన్న వైన్ షాపు వల్ల ఇబ్బందులు పడుతున్నామంటూ కూచిపూడి, పెదపూడి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఓ అర్జీని స్థానిక విలేకరులకు శుక్రవారం అందజేశారు. ఈ వైన్ షాపు ఉదయం ఆరు నుంచి రాత్రి 10 గంటలకు వరకు తాగుబోతులు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని, రోడ్డుకు అడ్డంగా వాహనాలను ఆపి ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. పి రమేష్‌బాబు, రవిబాబు, సురేష్, టి.నాగేశ్వరరావు, ఎం నాగరాజు, బోరుకాటి రామరాజు తమ అభ్యంతరాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేశారు.

ముళ్ల పొదల తొలగింపు

ముదినేపల్లి రూరల్: పెదగొన్నూరు పంచాయతీ పరిధిలో రహదారి మరమ్మతు పనులను శుక్రవారం చేపట్టారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను జేసీబీతో తొలగించారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, ఎన్డీయే కూటమి నాయకులు పనులను పర్యవేక్షించారు.